# నేపథ్యం

**— వాడ్రేవు చినవీరభద్రుడు**

మధ్యాహ్నం నాయుడిగారి బస్సులో దిగినప్పటినుంచి చింతామణి డ్రామా ట్రూపు చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. ఒకచేత్తో పురమాయింపులు, మరోవంక ఆక్షేపణలు, ఉన్న చోటే పెద్ద తీర్థమూ, సంతానూ. పిలిచిందేమో రామనవమి ఉత్సవాల కాయె. మొదటినాడే పిలుద్దామనుకున్నారు. మరీ చింతామణితో ఓం ప్రథమమేమిటని బాగోదంటే హరికథ పెట్టుకున్నారు.

రెండోనాటికి ఎలాగూ హరిశ్చంద్ర ముందే సెటి అయ్యింది. ద్వారపూడి బృందం, హరిశ్చంద్రుడూ, నక్షత్రకుడూ పోటాపోటీ పడ్డారు. నాటకం అయ్యేప్పటికి తొలి జాము కోడి కూసింది. జనానికి ఇంటికెళ్ళే ధ్యాస వుంటేనా? ఒకటే కన్నీరు. ఇంకా ఆ కాటికాపరి సీను కళ్ళముందునుంచి తప్పుకోలా. ఇదిగో ఇవాళ వీళ్ళు తెరిపిన పడేస్తారని జనానికి ఆశ. కడుపారా నవ్వుకోవచ్చని. అదిగో అతనే- ఆ ఎర్ర శాలువా, షరాయీ... శ్రీహరి వేషం కడతాడు. దాని సిగతరగ. గొప్పగా జమాయిస్తాడులే. ఇదిగో, ఆ లావుగా వున్నాడే ఎత్తుపళ్ళా, బట్టతలాను- ఆయనేమో సుబ్బిశెట్టి. స్కూలు మాస్టరీ చేస్తున్నాట్ట. పోయిన దఫా వచ్చాడు. విశ్వామిత్రుడు కాబోలు వేశాడు, రాగం బాగా గుక్కపట్టాడులే. కురుక్షేత్రంలో రాజరాజు వేస్తాడుట. ఆ బక్కపలచని గుంటేమో చిత్ర- ఒచ్చినప్పటిమంచీ ముంగిలాగ మూతి మెదపదు, బస్సు దిగీ దిగగానే రోడ్డుమీదే ట్రంకు పెట్టెమీద బైఠాయించింది దిక్కులు చూస్తూ. అవును, ఇంతకీ చింతామణి ఏదీ!

రామనవమి ఉత్సవాలుముందటేడు కన్నా ఘనంగా చెయ్యాలని అందరికీ వుంది గాని, సారా కొట్టు రమణగారు దన్ను నిలిచేదాకా ఎవడూ ముందుకు రాలేదు. రమణగారు కుర్రాడు. జమాజెట్టీలాంటి విగ్రహం, ఈ మధ్య రెండు లారీలు కొన్నాడు. ఇదేమీ కాదు, పైడితల్లిని వుంచుకున్నప్పటినుంచీ కొత్త రోషమూ, పౌరుషమూ వచ్చాయంటారు కిట్టనివాళ్ళు. ఎంత కిట్టకపోతే, వున్న మాట అంత బాగా అంటారు! రమణగారు, మున్సిబుగారు, కరణంగారు వూరంతా ఫర్మానా జారీ చేశారు- పండగ అయ్యేదాకా దేవుడికోసం ఏమడిగినా ఎవరూ కాదనకూడదని. ఈ నాటకాల వాళ్ళూ, కథలు చెప్పేవాళ్ళూ బయటనుంచి వస్తారు. వుండేది ఒక్క పూట. ఆ ఒక్క పూటా ఏమరిచి లోటు చేశామా 'మన వూరిలాంటిది', 'మనం ఇలాగ' అని తక్కిన దేశమంతా టాంటాం చేస్తారు. అందుకని మరింత జాగర్తగా వుండాలీ- అని.

ఊరి మధ్య రామ కోవిలే స్టేజి, విడిదీ అన్నీను. రామ కోవిల ఎదురుగుండా బల్లలు పరిచి టెంపరరీ స్టేజి ఏర్పాటు చేశారు. లోపల కటకటాల్లో ఓ మూల మైకులవాడూ, వాడి గ్రామఫోను పెట్టే. ఇంకో మూలకి దుకాణం అంతా పరిచేసి డ్రామా జట్టు. సర్పంచిగారు రావడం చూస్తూనే మైకులవాడు ఒద్దిగ్గా లేచి నిలబడ్డాడు. "ఆ ఏమబ్బాయ్, టిఫినీ అదీ చేశారా..." ఆయన మాటకి జవాబిస్తుండగానే, పక్కన వూచల్లోంచి సందుచేసుకుని పిల్లలు గ్రామఫోను పెట్టె తడుముతున్నారు. మైకులవాడు సర్పంచిగార్ని ఇబ్బందిగా చూస్తూనే, ఒకచేత్తో పక్కనుంచి వాళ్ళని తోసేస్తున్నాడు. ఆ మూల డ్రామా జట్టులో హార్మోనిస్టు గోడకి జారగిలబడి అరకంట ఆ సీను చూస్తో మెత్తగా బీడీ దమ్ము లాగుతున్నాడు. శ్రీహరి వేషం కట్టే అబ్బులుబాబు లగేజి సరుకు వచ్చిందో లేదో లెక్క చూస్తుండగా సర్పంచిగారు దగ్గరగా వచ్చి "కాఫీలూ, టీలూ గట్రా అందాయా" అన్నాడు. అబ్బులుబాబు బుజంమీది శాలువా సరిచేసుకుంటూ, మొహం నిండా చల్లని నవ్వు పరుచుకుని "మహాప్రభువులు, తమరే దయచేశారు. అదే పదివేలు" అని, సుబ్బిశెట్టి మాష్టార్ని కదిపి "మాష్టరుగారూ, వీరికీ మాకు ఎన్నేళ్ళ బాంధవ్యమండీ, వారు పెట్టేవారు, మనం తినేవాళ్ళం, బహు యోగ్యులైన మనుషులు, ధర్మదాతలు, ఈ దేశం ఎవరు ఒచ్చి వెళ్ళినా వారి పేరు చెప్పుకోకుండా వుండరు". "అయ్యో, నాకు ఎరికే కదా, ముందటేడు..." మాష్టారు అందుకున్నాడు. ఆయన మాట పూర్తి కాకుండానే అబ్బులుబాబు "అయ్యా, తమ దయవల్ల మాకు ఏ లోటూ లేదు, అన్నీ మహ దివ్యంగా అమర్చివున్నాయి, కాని చూశారూ, కాస్త..." సర్పంచిగారు వల్లకోటేశుని ముందుకు తోసి "ఒరే, ఆయన చెప్పేవన్నీ విని ఏం కావాలో దగ్గరుండి చూడు" అంటూ రెండడుగులు వేసి, గంభీర ముద్ర పట్టి, ఒక్క క్షణం తటపటాయించి చిన్ని నవ్వు పులుముకుని "ఇంతకీ, యీరోయినేదండీ, అదే, మన చింతామణి' అన్నాడు. అబ్బులుబాబు విధేయంగా మొహం పెట్టి "లెక్కకి మాతోపాటు వచ్చెయ్యాలి. కాని, ఏదో పనుండీ, జరూరు పని లెండి, వెనకాలే వస్తానంది. ఈ పాటికి సగం దారిలో వుండాల" అని "ఇంతకీ, రాగానే అయ్యగారి దర్శనం చేసుకొమ్మని చెప్పనా?" అన్నాడు. "అబ్బే, అబ్బే కనపడకపోతేనూ, అంతే, మరేం లేదు..." సర్పంచిగారు పెద్ద పెద్ద అంగల్తో వెళ్ళిపోయాడు.

## 2

సాయంకాలం అయింది. ఊరంతా నెమ్మదిగా కోవిల ముంగిట్లోకి చేరుతోంది. ఎలక్ట్రీ దీపాల్తో పందిరంతా మెరిసిపోతోంది. చిన్న చిన్న బల్బులు సీరీలు సెట్లు రంగురంగుల్లో నాలుగువేపులా పెట్టారు. ఎదురుగుండా రోడ్డువేపు పందిరిమీద ఆంజనేయులు, వినాయకుడు, లక్ష్మిందేవి బొమ్మలు పెట్టారు. లక్ష్మిందేవి చేతుల్లోంచి రంగు రంగుల కాసులు కిందికి ఒలికిపోతున్నట్టు దీపాలు. నాలుగేసి స్తంభాలకు ఒకటి చొప్పున ట్యూబులైట్లు. రోడ్డుకి అటూ ఇటూ జంతికలూ, వేరు సెనగలూ అమ్మేవాళ్ళు, బడ్డీ టీ కొట్లూను. రెండు చింత చెట్లకిందా పులి జూదంగాళ్ళు పటాలు పరిచేశారు. కిళ్ళీ కొట్లూ, అరవసాయిబు కొట్టూ జనాల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. మైకువాడు ఇప్పటిదాకా రెస్టు తీసుకుని ఫ్రెష్‌గా 'నమో వెంకటేశా' వేశాడు. ఇంకా ఒక రెండు దేవుడి పాటలు వేస్తేనే గాని సినిమా పాటలకి రాదు. చిల్లరకొట్టు చిట్టెమ్మ పాటలు వెయ్యమని కుర్రాళ్ళ గోల. బయట స్టేజిమీద అబ్బులుబాబు తెరలు కట్టుకుంటుంటే కుర్రాళ్ళు పక్కనుంచి లాగేస్తున్నారు. ఎదురుగుండా హార్మోనిస్టు సంగీత బృందానికి చోటు చేసుకుంటున్నాడు.

"మీ దగ్గర ఫోకస్ లైట్లుంటాయా?" వల్లకోటేశు.

"ఎక్కడ చూసావేంటి ఆ లైట్లు?" అబ్బులుబాబు నవ్వుతూ అడిగేడు.

"మరేవండీ, మా వూరోళ్ళు పూల రంగడు ఆడేవారట కదా. ఆ రోజుకి ఏర్పాటుచేస్తారంట. ఆ లైట్లుంటే గొప్పగా వుంటుందట కదా, ఏడుపు సీన్లో ఎర్ర రంగొస్తదట. మరేమో..."

"అవా, మా దగ్గరా వున్నాయిలే, ఇవాళ మాద్దువుగాని" అంటుంటే బుచ్చిరాజు వచ్చి భోజనాలకు రమ్మని కబురుచేశారు. అబ్బులుబాబు తెరలు కట్టే పని నల్ల కోటేశుని మాడమని హార్మోనిస్టుని పిలిచి లోపలకు వెళ్ళేసరికి సుబ్బిశెట్టి మాస్టారు రాగాలు దట్టించేస్తున్నాడు. బిల్వ మంగళుడి వేషం ఆవ వాయితీ ప్రకారం హార్మోనిస్టే వేస్తున్నాడు. చింతామణికి సొంత హార్మోనిస్టు ఆయన. తనూ వుండి చింతామణితో కలిపి వస్తానంటే అబ్బులుబాబు హడావిడి పెట్టి లాక్కొచ్చేశాడు.

బిల్వ మంగళుడి పత్నీమణి రాధ వేషం ఈసారి మొగాయనే వెయ్యాలనుకున్నారు. ఆ పదరు శాస్త్రి నల్లతుమ్మమొద్దు లాంటి ఒళ్ళు బద్ధకంగా విరుచుకుని "మాస్టారూ, నన్నడిగితే మీరు రాధ వేషమూ, నేను సుబ్బిశెట్టి వెయ్యాలండీ" అన్నాడు బొంగురుగా నవ్వుతూ. "బాబ్బాబూ! ఈ సారికి ఇలా కానీ, అయినా నా ఎత్తు పళ్ళు మాడలేదూ, అయినా ఈసారి సుబ్బిశెట్టి నాకు ఛాలెంజి. ఎన్నాళ్ళ నుంచి అనుకుంటున్నాననీ, ఇన్నాళ్టికి కుదిరింది ఈ వేషం. ఎప్పుడూ ఆ గెటప్పులేనా, వెరయిటీ వుండాలండీ, వెరయిటీ కారెక్టరు అక్టరన్నమాట. మాడండి" అని "చిత్రా" అంటూ బొంగురుగా పిలిచాడు. "మీ అమ్మ నన్ను గేటుకాడ నిలబెడుతుందటే" అంటో ఒక డైలాగు వల్లించి "ఎన్నో యేండ్లు గతించిపోయినవి కానీ" అంటో ఎత్తుకున్నాడు. భవానీ శంకరుడు ఇంతసేపూ కునుకు తీస్తున్నవాడు ఉలిక్కిపడి లేచి "హార్ని తస్సాదియ్యా, చంపావు కదయ్యా, అయినా అరిశ్చంద్రుడి పద్యాలు కదటయ్యా అవీ" అన్నాడు. "పోనీ భవానీ శంకరుడే అనుకుందాం. ఏదీ అత్తవారిచ్చిన అంటు మామిడి తోట" అని రెండున్నరలో వాయిస్తుంటే "ఏమి హడావిడి మాస్టారూ మీది, మరీ చిన్నపిల్లాడి లాగ, లేవండి, లేవండి, భోజనాలకు కబురొచ్చింది" అన్నాడు అబ్బులుబాబు.

"ఇంతకీ కోళ్ళే కోసారా?" భవానీ శంకరుడు తాపీగా అడిగాడు.

"కొక్కొరోకో" అన్నాడు మాస్టారు.

"బాపనాడివి కదయ్యా" అని ఎవరో అంటుంటే, "కనకనే, పదండయ్యా" అంటో కసిరాడు హార్మోనిస్టు.

రాజు వెడలె రవి తేజములలరంగ అన్నట్టు డ్రామా ట్రూపు రాత్రి భోజనాలకి మార్చింగు చేస్తుంటే వెనక నుంచి చిత్ర పీలగొంతుతో "బాబయ్యా! ఇంతకీ అక్కేదీ" అంది. "మీ అక్క ఆస్పటల్లో వుంది" అన్నాడు మాస్టారు బొంగురు గొంతుతో. "మీరూరుకోండి. పీకల మీద పరసమాడతారు" సన్న గొంతుతో కసిరి మళ్ళీ కాస్త గట్టిగా అంది "ఇంతకీ బయలుదేరిందా లేదా?"

ఎవరూ మాటాడలేదు. ఎవరికి వారికి మధ్యాహ్నం నుంచి ఎదురు చూడటంగానే వుంది. ఎవరికీ ఆ ముక్క పైకి అనుకోవాలని లేదు. లోపల బెరుగ్గా వుంది. పైకి బెట్టుగా వున్నారు.

"అదే వస్తుంది" నిర్లక్ష్యంగా మొహం పెట్టి ఆ పైని పక్కకు తిరిగి అబ్బులుబాబు "అయ్యా, బుచ్చి రాజుగారా, బుచ్చిబాబుగారా? మనూరు లాస్టు బస్సు ఎన్నింటికండీ" అన్నాడు. "ఏవేపుది? అప్పా? డౌనా? డౌనయితే ఇంకో అరగంటకి, అప్పు బస్సు ఈపాటికి వచ్చెయ్యాల"

కమ్మరిపేట కోళ్ళు మహ రుచిగా వున్నాయి.



ముప్పిబుగారు భోజనాల దగ్గర ప్రత్యేకించి మరీ శ్రద్ధ చూపించాడు. సర్పంచిగారు మనుషులు అందర్నీ పేరు పేరునా అడిగి మరీ తినిపించారు. మాష్టారు తన చిన్నప్పుడు మాంసం తింటూ వాళ్ళ నాన్నకి దొరికిపోయిన సంగతి చెప్తున్నాడు.

"అబ్బులు బాబూ, ఇంతకీ మన పిల్లఎక్కడా?" ముప్పిబు పొగాకు చుట్టుకొంటూ తీరిగ్గా అడిగేడు.

"అదే, మన చింతామణి."

"అదా, ఒచ్చేస్తుంది బాబూ, ఈపాటికి సగం దూరంలో వుండాలి"

"ఈ మధ్య బాగా ప్రోగ్రాములున్నాయేంటి?"

"అవును బాబూ సీజను కదా! ఇదయ్యాక కూర్చుకి పోవాలి. టైముకి ఎడ్జస్టు చెయ్యలేక కొన్ని ప్రోగ్రాములు ఒదిలేసుకుంటున్నాం. మరి ఈ ప్రోగ్రామంటే మహా ప్రభువులు, మీ ఉప్పుతిన్న వాళ్ళం గనుక హాజరయ్యేం."

"చింతామణి కేటీ? ఒంట్లో నలతా?" ముప్పిబు ఒదిలేట్టు లేదు. "అమ్మనంజికొడుకు. కోర్టు తిన నివ్వడం లేదు" హార్మోనిస్టు అబ్బులుబాబు చెవిలో



గొణిగేడు. "అబ్బే, అలాంటిదేమీ కాదండీ, ఇదిగో మా ఆరమణిస్టు చెప్తున్నాడు కదా, ఒక కోర్టు కేసుంటేమా, ప్లీడరుగార్ని కలవాలనందట" అబ్బులుబాబు మొహమాటంగా అన్నాడు.

"అదీ, అలా చెప్పు. ప్లీడరు మాట వినగానే ముప్పిబు చింతామణి గొడవ ఒదిలేశాడు. "ఇదిగో బుచ్చిరాజూ, ఆ అరటితోట తగాయిదా..."

3

రాత్రి తొమ్మిదయింది. స్టేజి మీద కరణంగారి అబ్బాయి మైకులో "ప్రేక్షక మహాశయులారా, ఈ రోజు రాత్రి పదిగంటలకి మన వూరు రామకోవెల ప్రాంగణంవద్ద శ్రీ అన్నపూర్ణా నాట్యమండలి వారిచే మహత్తర నాటక ప్రదర్శన 'చింతామణి' భారీ సెట్టింగులతో అపూర్వ అభినయ కౌశలంతో నేడే మీ ముందు ప్రదర్శింపబడనున్నది. త్వరపడండి. చింతామణి...గొప్ప హాస్యరస నాటకం చింతామణి."

చింతామణి అటునుంచి ఒచ్చే బస్సులోనూ రాలేదు. ఇటునుంచి పొయ్యే బస్సులోనూ రాలేదు. లోపల డ్రామా జట్టు మేకప్ సామగ్రీ. దుస్తులు పరుచుకుని రంగులు పులుముకోవడం మొదలు పెట్టారు. చిత్ర టంకు పెట్టెలోంచి అద్దం, తిలకం, రిబ్బన్లూ, పిన్నీసులూ, పెద్ద అలంకరణ సామగ్రి అంతా పరుచుకుని కూచుని ఆలోచిస్తుంటే అబ్బులు బాబు కసిరాడు "ఏమిటా పరధ్యానం. రంగు వేసుకో, అదొచ్చేస్తది. నీ వేషం నువ్వు కట్టెయ్యాల" అని పురమాయించేసాడు. "ఇదిగో గురువుగారూ




సరికొత్త యవ్వనం పొందండి! సంతానవంతులవ్వండి!!
చర్మ వ్యాధుల నుండి విముక్తి పొందండి!!!

హస్తప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, దాంపత్య సుఖము లేక పోవుట, అసంతృప్తి, సంతానము లేక పోవుట, సొరియాసిస్, పొడలు, దురద, నలుపు-తెలుపు-ఎరుపు మచ్చలు, పొడలు, రసిపుండ్లు, సుఖ సంబంధమైన వ్యాధులు, ఉబ్బసం, ఫిస్టులా, మొలశంకలు, స్త్రీలకు సుమ వ్యాధులు, సమస్త దీర్ఘ వ్యాధులకు 50 సం॥ల అనుభవ సిద్ధ ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు:- ● ప్రతి మంగళవారం 'గుడివాడ' బ్రాంచికి, పార్కు రోడ్, పెట్రోలు బంకు ప్రక్కన ● ప్రతి బుధవారం 'విజయవాడ' శ్రీబృందావన్ లాడ్జిలో, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, గవర్నరుపేట ● ప్రతి శుక్రవారం 'రాజమండ్రి' బ్రాంచికి, కుమారి టాకీస్ ఎదుట వీధిలో ● ప్రతి శనివారం 'ఏలూరు' ఆంజనేయులుగారి సత్రంలో, పాత బస్టాండ్ వద్ద ప్రతి క్యాంపులోనూ ఉ॥8గం॥ నుండి సా॥6గం వరకు

50 సం.ల గొప్ప అనుభవము గల వైద్యరత్న
డా॥ ఎస్. లక్ష్మణమూర్తి (సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్) సెక్స్ & చర్మ వ్యాధుల హాస్పిటల్, శీతయ్యగారితోట, పిఠాపురం-533450, ఫోన్స్: 94, 61

నేను చూడండి'' అంటూ అరిచాడు మాష్టారు. మేకప్‌మేన్ అతని ముఖానికి నల్ల రంగు దట్టంగా పులిమి తెల్ల రంగుతో నామం దిద్దుతున్నాడు. ఆయన ఉత్సాహమనాలో అల్లరనాలో అబ్బులుబాబుని క్షణం పాటు కట్టిపడేసింది. ''ఇదిగో అమ్మాయ్, చూడు. మాష్టార్లా వుండాలి. నా వయసులో నాకిలాంటి వాళ్ళు దొరికుంటేనా! షణ్ముకి ఆంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి పత్తాలేకుండా పోదురు'' అన్నాడు. ''ఉండవయ్యా, మాష్టారుని మహ పొగుడుతున్నావు. నా సంగతి చూడు'' అన్నాడు భవానీ శంకరుడు. అంతా గొల్లున నవ్వారు. ''సర్లే నీదీ ఓ మేకప్పే నేంటి?'' అన్నాడు మాష్టారు ఎకసక్కెంగా.

జిగురు రాసి ముంగురులు ఒంకీలు తిప్పి అంటిం చుకుంటుంటే కటకటాల కంతల్లో ముఖాలు పెట్టి కుర్రాళ్ళ ఆసక్తిగా చిత్రనే చూస్తుండిపోయారు. కళ్ళకి మందంగా కాటుక పెట్టుకుని సన్నని రంగు రంగుల చుక్కలు దిద్దుకుంది. పెదాలకి ఎర్ర రంగు పూసుకుంది. ''అయ్యా శంకరంగారూ, ఇదిగో ఈ వెనకాల కాస్త సరిచెయ్యండి'' అంటూ పిలుస్తుంటే ''నీకు వెనకాల ఏటయింది సిత్రా'' అన్నాడు మాష్టారు బొంగురుగా. మళ్ళీ గొల్లున నవ్వు.

ఇంతలో మళ్ళీ లోపలకి వచ్చాడు అబ్బులుబాబు. ఈసారి అతని మొఖం కులాసాగా లేదు. బరువుగా వుంది. ఎంత దాచినా ఏదో బాధ బయట పడుతూనే వుంది. ''ఆరమణేస్టేడీ?'' అన్నాడు. ''బయటే వున్నాడు కదా'' ఎవరో అన్నారు. ''ఇంతకీ చింతామణి రాలేదా?'' భవానీ శంకరుడు తాపీగా అడిగాడు. ''ఏడ్చినట్టే వుంది. అదే వుంటే ఇదంతా ఎందుకు? ఇవేళ అభాసుపాలయిపోతాం. ఇన్నేళ్ళు నాటకా లాడేను, ఇదిగో ఇన్నిసార్లు'' జుట్టు చేతుల్లోకి పీక్కుంటూ ''ఇవ్వాడేను. ఎన్నడూ ఎరుగనిలాగ, దానికేం పొయ్యేకాలమని'' అన్నాడు. ''ఇంతకీ ఇక రాదంటారా?'' మళ్ళీ శంకరంగారు తాపీగా.

''రాదయ్యా రాదు. ఇదిగో ఇంకో మాట, మనం ఇకమంచి పొద్దున్నకి కదల్లేం. ఊళ్ళోవాళ్ళు మనవాళ్ళు విరగ్గొట్టి మరీ పడేస్తారు. కిరాయికి ఒప్పుకున్నాక ఆడాలా వద్దా, ఆడాలి. మరి చింతామణి లేకుండా ఎలా ఆడుతాం?'' అబ్బులుబాబు జుట్టు పీక్కున్నాడు. తుపానుల నౌకలు చిక్కుకున్నప్పుడు ముసిలి సరంగులు జుట్టు పీక్కున్నట్టు ''ఆడలేం, ఆడలేం అంటున్నారు.''

''ఆ మాట వాళ్ళకి చెప్పేద్దాం'' మళ్ళీ శంకరుడు.

''ఎవళ్ళకి?'' కోలగా నవ్వేడు. ''ఏడిసినట్టే వుంది. ఆళ్ళకా? ఆళ్ళకి చెప్తాదుటండీ ఈయన'' తక్కిన వాళ్ళవేపు తిరిగి ''అయ్యా! చింతామణి రాని



కారణంచాత ఇవేళ మేము నాటకం కట్టబోవటం లేదు. ఏమీ అనుకోకండి'' అని చెప్తావా? మక్కెలిరగదంతారు. పైగా ఈ బోడి జుట్టుకి కోళ్ళు కావాల్సి వచ్చేయేం అని మరీను.''

''కోడికూరా! అబ్బ మహా రమ్యంగా వుంది. మాట్టారు ఈ లోకంలోకి వచ్చారు.

''అబ్బులుబాబు అతణ్ణి విస్మపోయంగా చూసాడు. బయటకి పోబోతూ ''ఏడీ ఆరమణేస్టు, ముందు ప్రార్థన చేసేద్దాం. పదయిపోయింది. తర్వాత సంగతి తర్వాత అనేసి వెళ్ళిపోయాడు. అతని నిబ్బరం అందర్నీ ఆశ్చర్య పెట్టింది. అంత నిబ్బరమంతుడు గనకనే ఇన్నాళ్ళు నాటకాలాడేడు అనుకున్నట్టున్నారు. ''మా పెద్ద ముండా కొడుకు'' అన్నాడు భవానీ శంకరుడు.

ఎవ్వరూ మాటాడలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు.

## చలి బాధ

***కా**ళిదాసు 'ఋతు సంహారమ్'లో 'చలి' గురించి, చలి బాధ గురించి భలే సున్నితంగా వర్ణించిన ఒక శ్లోక పదం ఇది-*

**''తరుణ్యః హసంతి నోచ్చై**
**ర్దశనాగ్ర భిన్నాన్**
**ప్రపీడ్యమానా నధరా నవేక్ష్య''**
**—4-6**

*శృంగార క్రీడానందాన్ని తనివితీర అనుభవించిన యువతులు పెదవి విప్పి ఒక మాటైనా పలకడం లేదు. ఏం? అంటే ప్రియుడి దంత క్షతాలకు గాయపడిన పెదవులు చలిగాలికి బిగపట్టే నవ్వనీయకుండా చేశాయట!. ఎంత లలిత భావన!*

ప్రేక్షక మహాశయులారా. మీరు ఎప్పుడెప్పుడా అని ఎంతో ఉత్కంఠతతో ఎదురుచూస్తున్న చింతామణి మరి కొద్ది సేపట్లోనే ప్రదర్శింపబడుతుంది. శ్రీ అన్నపూర్ణా నాట్యమండలివారి మహత్తర హాస్య రస ప్రదర్శన చింతామణి''

''ప్రార్థనకి రండి, రండి''

''హారతి ప్లేటెమిదేదీ?''

''ఒత్తే.నూనే''

హడావిడిలో ఎవరో మంచినీళ్ళు చెంబుని తన్నేసారు. నీళ్ళు ఒలికిపోయేయి. మేకప్‌మేన్ తిట్టుకుంటూ సామాను ఓ మూలకి జరుపుకుంటే కోటిగాడు, సూరిసత్తిగాడు హడావిడిగా లోపలికొస్తూ ''ఏమండీ, చింతామణి రాలేదా? మరి నాటకం ఎలా ఆడాలనుకుంటున్నారు?'' అంటూ కేకలేసారు.

''ఒరే నే ముందే చెప్పానురా మనాళ్ళకి. ఈ డ్రామాగాళ్ళంతా వేస్టని. రికార్డ్ డేన్సు పెట్టుకుందా మంటే ఇన్నారా? ఇప్పుడు చూడు'' అన్నాడు కోటిగాడు.

''ఇప్పుడు మటకు ఏటయ్యింది? ఇంకసేంత సేపు చూడటం. లేకపోతే ఈళ్ళనే డాన్సు కట్టమనడం. అదిగో ఆ గుంటది వుంది కదా''

### 4

''పరబ్రహ్మ పరమేశ్వర...''

ఎర్రని పాతకాలపు సిల్కుతెర. దాని ఆకుపచ్చని అంచులు. లోపల నటగాయక బృందం గొంతెత్తి ఆలాపన. ఆ సన్నని కాంతిలో మిలమిలల తెరలోంచి మెరిసే ఆరతిదీపం వెలుతురు. ఎదురుగా హార్మోనిస్టు శృతి, జనాన్ని మత్తెక్కించే నాటకాల మాజిక్కు. మంత్రజాలం, మాయాజాలం. పై నుంచి కాంతులు చినికే చుక్కలు దూరంగా పులి జూదం మీద చిల్లర పెన్ను పెట్టుకుంటున్న చప్పుడు. బళ్ళ ఎద్దులు మెత్తగా నెమరు వేస్తున్న వేళ.

''ఇంతకీ చింతామణి వచ్చిదంటనా?'' ఎవరో బిగ్గరగా అడిగారు.

''రాలేదట, కోర్టు కేసట'' ఎవరో గొణిగేరు.

''కోర్టుకేసా? ఏ లాడ్జిలో చిక్కిందంట?''

''లాయరుగారి దగ్గర కెళ్ళిందంట''

''ఇంటికా?''

ముందు వరసలో జనం గొల్లుమన్నారు. దూరంగా సాయిబు కొట్టు దగ్గర మూగిన కుర్రాళ్ళు ''నాటకం లేకపోతే వూరుకొనేది లేదు'' అంటూ అరిచారు. ఈ మూల కిళ్ళీ బడ్డీల నుంచీ అవే అరపులు.

అబ్బులు బాబు తెర వెనక నుంచి మైకులో ''అయ్యా ప్రభువులు చిత్తగించాలి. కొద్ది ఆలస్యం. చింతామణి వేషం వెయ్యాల్సిన సదరు అమ్మాయి'' అంటూండగానే ప్రేక్షకులు గోల చేసారు. కుర్రాళ్ళు

ముందుకొచ్చి "నాటకం లేకపోతే పోనీండి, రికార్డింగ్ డాన్స్ కావాలి" అంటూ అరిచారు.

లోపల డ్రామా ట్రూపు బిక్క చచ్చిపోయి వున్నారు.

"పోనీ నువ్వు చింతామణి వెయ్యకూడదూ"

అబ్బులు బాబుకి ఆ మాట వినగానే అంత అయోమయం మధ్యా నవ్వొచ్చింది. గడచిపోయిన కాలం గుర్తొచ్చింది "ఆ రోజులయితేనా" అను కున్నాడు.

ఆలస్యం కూడదు. నిర్ణయం తీసుకోవాలి.

"చిత్రా అయిందేలాగూ అయింది. మాట దక్కించాలంటే ఆ రికార్డింగు డాన్సేదో వెయ్యక తప్పదు. నువ్వు కాస్త మేకప్పు గట్రా దిద్దుకో" అన్నాడు. అతను చెప్తున్నదేమిటో అర్థమయ్యేసరికి ఆ అమ్మాయికి ఒణుకు పుట్టింది., చెమటలు పోసేయి.

"నేనా"

"నువ్వే మరి. ఏం చేస్తాం"

హార్మోనిస్టు బిల్వమంగళుడు వేషం తప్పిపోయిన ఆనందంలో వున్నాడు. భవానీ శంకరుడు తాపీగా కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్నాడు. మాస్టారు అద్దంలోకి చూస్తూ డైలాగులు ఒప్పజెప్పుకుంటు న్నాడు. ఆయన ఇవ్వాళ నాటకం వేస్తేనేగాని నిద్ర పోడల్లే వుంది. రాధ వేషం వెయ్యాల్సిన నల్ల తుమ్మ మొద్దు బయటక పరచిన సామానంతా పెట్టెలోకి ఎత్తుకున్నాడు. చిత్ర అబ్బులు బాబుని చూసింది. అతని మొహంలో ఆదుర్దా. మాట పడాలన్న బాధ. తండ్రిలాగా ఆదుకున్న మనిషి.

"కానీండి బాబయ్యా. స్టేజీ ఎక్కుతాను. ఇంతకీ డాన్సరేదీ?"

"ఎవళ్ళో ఒకళ్ళు. వూళ్ళో కుర్రాళ్ళు" అని అంటూండగానే సూరి సత్తిగాడు బెల్ బాటమ్ ప్యాంటూ, ఎర్రచేతుల టీషర్టూ తొడుక్కుని వచ్చే సాడు. "ఏదీ కాస్త మేకప్ కొట్టండ" అంటూ. ఇంకా కోరమీసం దాని పదహారేళ్ళవాడు పిటపిట లాడే ఆటగత్తె పక్కన డాన్సు అనుభవానికి తహతహ లాడుతున్నాడు. "తమ్ముడిలా వున్నాడు"

"ప్రేక్షక మహాశయులారా. మీరు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహత్తర సినీ రికార్డింగ్ డాన్స్ మరి కొద్దిసేపట్లో ప్రదర్శింపబడుతుంది. సైలెంట్. అంతా నిశ్శబ్దంగా వుండాలి. గ్రామఫోన్లు అబ్బాయి ఎక్కడున్నా సరే స్టేజి దగ్గరికి రావాలి. ప్రేక్షక మహాశయులారా"


రాత్రి పదకొండు గంటలకి రికార్డింగ్ డాన్స్ మొదలయ్యింది. ఒక దాని వెనక ఒకటి లేటెస్టు రికార్డులన్నీ మోగించారు. ఒకడు వెనక ఒకడు కుర్రవాళ్ళంతా స్టేజి ఎక్కారు. చిత్ర నడుమూ, బుజాలూ అప్పుడప్పుడు పిరుదులూ కుర్రవాళ్ళ చేతుల వేడికి పొంగే రక్తపు పెళపెళకి అలిసి పొయ్యాయి. సూరి సత్తిగాడు డాన్సు బలేగా చేశాడు. వాడి డాన్సు చూస్తే చిత్రకే ముచ్చటేసింది. కుర్ర ముండ. మీద చేతులు వెయ్యడానికి మొహమాట పడ్డాడు. తనే అటూ ఇటూ తిరిగి కాస్త జోడు నిలబడింది. మధ్యలో ఒకటి రెండుసార్లు కావలించు కుంది. ఇంకా ఆడదేహపు ఆకలి అనుభవానికి రాని ఒళ్ళు, నెచ్చని వూర్పులు, పిగ్గరితనం, అరమోడ్పుగా వాలిపోయే కళ్ళు. అరవసాయిబు మేనల్లుడిలా ఒళ్ళంతా ఆకలిగా తడిమెయ్యలేని ఆడపిల్లల మెత్త దనం.

డాన్సులు అయ్యేటప్పటికి రాత్రి రెండు. నాలుగు గంటలపాటు డాన్సు చేసి ఒళ్ళు తీపులు పుట్టి చెమటలు పోసి పోసి అలసిపోయింది చిత్ర. కాళ్ళు బిగలాగుతున్నాయి.

లోపల డ్రామా ట్రూపు టీలు తెప్పించుకుని తాగుతున్నారు. వాళ్ళ కళ్ళలో భయం పోయింది. రమణగారు. అతని కళ్ళు జీరెక్కి వున్నాయి. వస్తూనే "ఏమే పిల్లా" అంటూ దగ్గరగా వచ్చి ఒక చేత్తో తన జబ్బ నొక్కి "ఎక్కడ నేర్చుకున్నావే యీ ఆటలన్నీను" అన్నాడు. తన చీరెకట్టు సగంలో వుండి పోయింది. సిగ్గుగా ఒళ్ళంతా చల్లబడింది. "ఏటీ చీర కట్టాలంటావా?" పళ్ళన్నీ బయట పెట్టి నవ్వాడు రమణగారు. ఈసారి ఎడం చేత్తో పిర్ర మీద గిల్లుతూ "అయ్యా తమ దయ, మా మర్యాద దక్కింది, అంతే చాలు" అబ్బులు బాబు వెనక నుంచి వినయంగా చెప్తున్నాడు. "సరి సరి. బాగా ట్రెయినింగు ఇవ్వు పిల్లకి. ఇంకా పైకొస్తాది" అంటూ కుడిచేతి చూపుడు వేలితో ఆమె పొట్ట మీద అడ్డంగా గీసి బయటకు వెళ్ళిపోయాడు.

"తొందరగా కానీ, ఎంతసేపు బట్టలు మార్చు కోడం?" అబ్బులుబాబు కసిరేడు.

"బాబయ్యా, అక్క ఎందుకు రాలేదు?" చిత్ర పీల గొంతుతో పేలగా అంది. "ఏమి ఆపద వచ్చి పడ్డాదో?"




"చిత్రా మీ అక్క మన్ని మోసం చేసింది" అంటు న్నాడు మాష్టరు బొంగురు గొంతుతో "మీరీ నాటికంకి వేషం విప్పరల్లే వుంది" చిత్ర విసు క్కుంది. మేష్టరుకి కోపం ముంచుకొచ్చింది. "నాలుగు గెంతులు గెంతేటప్పటికి హద్దులు మర్చి పోతున్నావు" అంటూ లేచాడు. నోరు విప్పితే గుప్పున సారా కంపు. అతను నోటికొచ్చినట్టు పేలుతుంటే శంకరం తాపీగా వింటున్నాడు. హార్మోనిస్టు వాయిద్యం సర్దుకుంటున్నాడు.

చిత్రకి విస్త్రాణ కలిగింది. ఇంతసేపూ తను పడ్డ శ్రమంతా ఏమయినట్టు? ప్రేక్షక మహాశయులికి వాళ్ళ వినోదం వాళ్ళకి దొరికింది. అబ్బులు బాబుకి మర్యాద దక్కింది. సుబ్బిశెట్టి మోజు సుబ్బి శెట్టిది. మరి తనకి?

ఒక మూలగా నిల్చొని డ్రామా చీరె విప్పుకుంటు ంటే లోపలికి హడావిడిగా వచ్చాడు సారా కొట్టు

"సరిసరి. దాని మాటెత్తకు నా దగ్గర" కసిరాడు అబ్బులు బాబు.

అప్పుడు చూసింది చిత్ర. రామకోటిలకీ రెడ్డిగారి బంగళాకీ మధ్య సందులో ఏటవాలుగా పడుకున్న నీడ చాటున నిల్చి కటకటాల్లోంచి కళ్ళప్పగించి చూస్తో సూరి సత్తిగాడు! వాడి కళ్ళల్లో కన్పిస్తున్నదాన్ని ఏమనుకోవాలో చిత్రకి తెలియలేదు. ఒక్క క్షణం జాలిగానూ, ఆసక్తిగానూ చూసింది వాణ్ణి.

"కానీండి అబ్బులు బాబూ, ఇంతింత వేషాలేసే వాళ్ళకే ఇంతలేసి పొగరయ్యితే ఎలా చెప్పండి?" సారా మత్తూ, అసూయ మత్తూ రెచ్చ గొడుతుంటే మాష్టరు ఎగురుతున్నాడు. అబ్బులు బాబు అతడి బుజాల్ని చేతుల్తో అదిమి కూచోబెడుతున్నాడు.

బయట తెరలు అలానే వున్నాయి. వాటిని విప్పండర్రా, విప్పండి.

●